## క్లుప్తంగా

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న ఏడీ హరికృష్ణ

**దొర్నిపాడు:** రైతుల భూ సమస్యలకు జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఏడీ హరికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కొండాపురం గ్రామంలో భూసర్వే పూర్తి కావడంతో స్థానిక సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామంలో భూసర్వే వందశాతం పూర్తయ్యిందని, రికార్డుల వివరాలు సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుక రావాలని సూచించారు. నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయడంపై మండల సర్వేయర్ మల్లయ్యను అభినందిచారు. డీటీఎస్ చెన్నయ్య, గ్రామ సర్వేయర్ గంగాధర్ పాల్గొన్నారు.

**రికార్డులు సక్రమంగా నిర్వహించండి**

**ఉయ్యాలవాడ :** ఉపాధి హామీ పథకంలో పనులకు సంబంధించిన 7 రకాల రికార్డులను ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా నమోదు చేయాలని ఏపీఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.60 లక్షల పని దినాలు కాగా ఇప్పటి వరకు 1.11 లక్షల పని దినాలు పూర్తయ్యాయని చెప్పారు.

**పౌష్టికాహార కిట్ల పంపిణీ**

**చాగలమర్రి:** స్థానిక నాగులకట్ట సమీపంలో నున్న అంగన్‌వాడీ సెంటర్–6లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అంగన్‌వాడీ కార్యకర్త రజిని బుధవారం పంపిణీ చేశారు. కిట్లలో రాగిపిండి, ఎండు ఖర్జూరాలు, అటుకులు, బెల్లం, పప్పు చెక్క, పాలు, గుడ్లు ఉన్నాయని చెప్పారు. అలాగే వారికి మధ్యాహ్న భోజనం కూడా అందజేశారు. కాగా 16 మంది లబ్ధిదారులుండగా 14 కిట్లు మాత్రమే వచ్చాయని కార్యకర్త చెప్పారు.

**నేడు 'జగనన్న సురక్ష'**

**గోస్పాడు:** మండలంలోని దీబగుంట్ల గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ, సీసీఆర్సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్ తదితర 11 రకాల ధ్రువపత్రాలు అందజేస్తామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నంద్యాల(రూరల్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథక కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల మండల అధ్యక్షులు శెట్టి.ప్రభాకర్ కోరారు. బుధవారం మండలంలోని పుసులూరు గ్రామంలో ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురికి ఆదాయ, కుల ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ రాము, ఎంపీటీసీ దశరథరామి రెడ్డి, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

**వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**గోస్పాడు:** చిన్న పిల్లల వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని యాళ్లూరు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాజేష్ కుమార్, మాధవి ప్రసన్న తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 40మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

**మాన్యం కౌలుకు వేలం**

**గోస్పాడు:** మండలంలోని తేళ్లపురి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూముల కౌలుకు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఈఓ వీరయ్య, ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయానికి చెందిన 12 ఎకరాల భూమికి వేలం వేయగా రూ.3.17లక్షలకు గ్రామానికి చెందిన రైతు దక్కించుకున్నారు.

**నిర్మాణాల పరిశీలన**

**చాగలమర్రి:** మండలంలోని మద్దూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న 8 తరగతి గదులను బుధవారం ఎంఈఓ న్యామతుల్లా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.93 లక్షల వ్యయంతో నాడు–నేడు కింద చేపట్టిన పనులు చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే పూర్తి కానున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, లలిత కుమారి ఉన్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

**దొర్నిపాడు:** మండలంలోని చాకరాజువేముల రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని రత్నమ్మ, దొర్నిపాడులోని ఉర్దూ పాఠశాలలో మొబీనా, రెగ్యులర్ పాఠశాలలో తేజేంద్రకుమార్ ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రులు ఆధ్వర్యంలో ఎంఈఓలు అబ్దుల్ కరీం, రామచంద్రయ్య బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని, విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దాలని వారు సూచించారు. ఉపాధ్యాయులు కిశోర్, తహెర్‌మెయిన్, లక్ష్మిదేవి, పర్వీన్‌బీ, అహ్మద్‌హుసేన్, విజయలక్ష్మి, సుభాషిని రజాక్ పాల్గొన్నారు.

**ప్రజలకు దారి చూపండి**

**నంద్యాల(న్యూటౌన్):** నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో రైల్వే ట్రాక్ దారిని మూసి వేయడాన్ని వ్యతిరేకిస్తునఆనమని సీపీఎం నంద్యాల కార్యదర్శి పుల్లా నరసింహులు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్ దారిని మూసివేయడాన్ని పరిశీలించారు. రైల్వే అధికారులు స్పందించి రైల్వే ట్రాక్‌ను వెంటనే తెరిపించాలని కోరారు.

---



సంజీవనగర్ గేటు వద్ద చరవాణిలో మాట్లాడుతూ వాహనం నడుపుతున్న ద్విచక్ర వాహనదారుడు



శ్రీనివాససెంటర్ వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న దృశ్యం



ఆటోనగర్ వద్ద జాతీయరహదారిపై ద్విచక్ర వాహనంపై నలుగురు వెళుతున్న దృశ్యం

# మమ్మల్ని అడిగేదెవరు?

- యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లం'ఘనులు'
- అడ్డగోలు పార్కింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్‌తో వాహనదారులకు ఇక్కట్లు
- మితిమీరిన వేగంతో దూసుకుపోతున్న మైనర్లు




టెక్కెలో ఎస్‌ఎన్ టీస్టాల్ వద్ద నో పార్కింగ్ బోర్డు పక్కనే నిలిపి ఉంచిన బైకులు

**నంద్యాల(సెంట్రల్):** నంద్యాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలకు నీళ్లొదిలి విచ్చలవిడిగా వాహనాలు నడుపుతున్నారు. పోలీసులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా కొందరు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు మనల్ని అడ్డుకునేదెవరు అనేట్లు వెళ్తున్నారు. ముఖ్యంగా టెక్కె ప్రధాన రహదారిలోని మయూరి బార్, ఎస్‌ఎన్ టీస్టాల్ వద్ద, ఆత్మకూరు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం పక్కన, ఎన్‌జీవోస్ కాలనీ మెయిన్‌రోడ్డు వెంట, గాంధీచౌక్ సర్కిల్, సంజీవనగర్ గేటు కూడలి, నూనెపల్లెలోని కర్నూలు–కడప రోడ్డు వెంట అడ్డగోలుగా వాహనాలను నిలిపి తోటి వాహనదారులకు నరకం చూపుతున్నారు. సంజీవనగర్–శ్రీనివాస సెంటర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న అంతర్గత రహదారుల నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు యూటర్న్‌లు దూరంగా ఉండటంతో చుట్టూ తిరిగి రాలేక రాంగ్‌రూట్‌లో వస్తున్నారు. ముఖ్యంగా ఆటోనగర్ వంతెన వద్ద నందికొట్కూరుకు వెళ్లేందుకు అన్ని వాహనాలు కర్నూలు వైపు నుంచి వచ్చే వాటికి ఎదురుగా వెళ్తుండటంతో ప్రమాదం పొంచి ఉంది. ద్విచక్ర వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ చేస్తూ, ఇతరులను ప్రమాదాల అంచుకు నెడుతున్నారు. ఇక మైనర్లు, చరవాణి మాట్లాడుతూ వాహనం నడిపే వారికి కొదవే లేదు. సైలెన్సర్లు తీసేసి రోడ్డు వెంట కర్ణ కఠోరమైన శబ్దంతో మైనర్లు బైక్‌లు నడుపుతున్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించి వీరిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కేసు నమోదు

**దొర్నిపాడు:** మండలంలోని బుర్రారెడ్డిపల్లెలోని ఇందిరానగర్‌కు చెందిన శ్రీరాములు అనే యువకుడు ఓ అనే యువతిని వేధిస్తుండటంతో దొర్నిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్ని నెలలుగా యువతిని వేధిస్తుండటం, ఒంటరిగా బయటకు వెళ్తే అటకాయించడం వంటివి చేసేవాడు. పలుమార్లు మందలించినా మార్పు రాకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

## వర్షంలోనూ పింఛన్ అందజేశారు..



తుపాన్‌లో సుజానమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు స్వాతి

ఈ ఫొటోలో వర్షంలోనూ గొడుగు మాటున పింఛన్ అందుకుంటున్న మహిళ పేరు సుజానమ్మ. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామ నివాసి. గతేడాది అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు గ్రామం చుట్టూ వరదనీరు చేరడంతో గ్రామం నుంచి బయటకు కాలుపెట్టలేని పరిస్థితి. అలాగే జోరు వానతో ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఎవరూ లేని ఒంటరి మహిళ కావడం, అవసరాలకు డబ్బు చేతిలో లేకపోవడంతో ఆందోళన చెందుతుండగా వలంటీర్ స్వాతి వచ్చి పింఛన్ సొమ్ము అందజేసింది. జోరు వానలోనూ ఇంటికొచ్చి పింఛన్ అందజేయడంపై నాడు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### మా వలంటీర్ పిలిస్తే పలుకుతుంది



నేను ఒంటరి మహిళను. వారం పాటు విడవకుండా కురుస్తున్న వర్షంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ క్రమంలో ఈ నెల పింఛన్ అందదు అనుకున్నాం. అయినా మాకు ప్రతి నెల లాగే ఇంటికి వచ్చి సొమ్ము అందజేసింది. అంత వర్షం కురుస్తున్నా గొడుగు వేసుకొని వచ్చి డబ్బులు ఇవ్వడంతో నాడు నాకు ఆర్థిక ఇక్కట్లు తప్పాయి. మేము ఇంటిలో నుంచి కాలు బయట పెట్టలేనంతగా వర్షం కురుస్తున్నా వచ్చి పింఛన్ ఇవ్వడం సంతోషకరం. – సుజానమ్మ

## కరోనా సమయంలో ఇంటింటికీ వచ్చి ఎలా ఉన్నారని ఆరా తీశాడు



కరోనా సమయంలో సొంత ఖర్చులతో సరుకులు అందజేస్తున్న వలంటీరు రమణ

ఈ చిత్రంలో కూరగాయలు అందుకుంటున్న మహిళ పేరు చెంచు అంకమ్మ. అహోబిలం గ్రామం చెంచుకాలనీలో నివాసముంటుంది. కరోనా కాలంలో చెంచులు ఎవరూ బయటకు పోలేక పూటగవడం ఇబ్బందిగా ఉండేది. విషయం తెలుసుకున్న వలంటీర్ రమణ సొంత ఖర్చులతో కాలనీలో ఉన్న సుమారు 120 కుటుంబాలకు అవసరమైన కూరగాయాలు, నిత్యావసర సరుకులు ప్యాక్ చేయించుకుని అందరికీ పంపిణీ చేశాడు. అలాగే ఆ సమయంలో అవసరమైన వారికి మందులు తెచ్చి ఇచ్చేవాడు.

– చెంచు అంకమ్మ, అహోబిలం

### సరుకులు అందజేసి.. ఆరోగ్యంపై వాకబు



కరోనా సమయంలో ఎవరూ బయటకు రాలేదు. దీంతో నిత్యావసర సరుకులు అయిపోయి ఇబ్బంది పడుతున్నాం. ఈ సమయంలో మా వలంటీర్ రమణ సొంత ఖర్చులతో సరుకులు తీసుకొచ్చి ఇంటింటికీ తిరిగి అందజేశాడు. అలాగే ప్రతి రోజూ వచ్చి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకునేవాడు.కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోని కాలంలో మమ్మల్ని బాగా చూసుకున్నాడు. – చెంచు అకమ్మ, అహోబిలం

# పిల్లల నమోదుపై శ్రద్ధ వహించాలి



కళాశాల విద్యార్థినులతో కలెక్టర్ మనజీర్

**నంద్యాల(న్యూటౌన్):** బడి ఈడు పిల్లల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించి సర్వే త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ ప్రోగ్రాం పనితీరును కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేకి సంబంధించి ఇంటర్మీడియెట్‌లో విద్యార్థులు ఎంతమంది అడ్మిషన్ పొందారు, ఇంటర్ ఫెయిల్ అయి తిరిగి కళాశాలలో చేరిన విద్యార్థులు ఎంతమంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలలో చైల్డ్ ఇన్ఫో అడ్మిషన్ పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈఓ సుధాకర్ రెడ్డి, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, డీవీఈఓ సునీతా, కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ ఉన్నారు.

# జగనన్న సురక్షతో పేదలకు లబ్ధి



టెక్కే మార్కెట్ యార్డులో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు



వార్డులో ధ్రువపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా



నర్సాపురంలో ధ్రువపత్రం అందుకుంటున్న లబ్ధిదారురాలు

**నంద్యాల(సిటీ):** జగనన్న సురక్షతో పేదలందరికీ లబ్ధి చేకూరుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నీసా అన్నారు. బుధవారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియం, టెక్కె మార్కెట్ యార్డులో జగనన్న సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో అర్హత ఉండి ఎవరూ ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండకూడదని సీఎం జగనన్న ఈ కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. పేదలకు పథకాలు అందజేసేందుకు 11 రకాల ధ్రువపత్రాలను ఎలాంటి రుసుం లేకుండా అందిస్తున్నామన్నారు. 11వార్డు చాంద్‌బాడ, 13వ వార్డు టెక్కె, 14వ వార్డు సరస్వతి నగర్, 15వ వార్డు గోపాల్ నగర్, 16వ వార్డు ఎన్‌జీఓ కాలనీలకు చెందిన 3,601 దరఖాస్తులకు గాను 3,430 అప్లికేషన్లు రిజిస్ట్రేషన్ కాగా 3,223 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, తహసీల్దార్ శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు సలాముల్లా, కౌన్సిలర్లు తమీమ్, విజయభాస్కర్, 15వ వార్డు ఇన్‌చార్జ్ సన్నల సాయిరాంరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, నాయకులు భాస్కర్ రెడ్డి, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకురాలు షేక్ ఫాతిమాబీ పాల్గొన్నారు.

**నేడు ఆర్.జంబులదిన్నెలో..**

**ఉయ్యాలవాడ :** మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

**రుద్రవరం:** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రవీంద్రప్రసాదు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నర్సాపురంలో బుధవారం వారు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 222 మందికి అవసరమైన ధ్రువ పత్రాలను జెడ్పీటీసీ మాధవి, ఎంపీటీసీ కిరణ్ పంపిణీ చేశారు. నాయకులు లక్ష్మిరెడ్డి, ప్రసాదరెడ్డి, శుద్దుల కృష్ణుడు,అబ్బి,నాగరా జు,సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వరరెడ్డి,ఓబన్న ఉన్నారు.

### వారంలోపే ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది



జగనన్న సురక్ష క్యాంపుపై ముందుగా మా వార్డులో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మాకు ఆరోగ్యశ్రీ కార్డు లేదని చెప్పడంతో మున్సిపల్, సచివాలయ సిబ్బంది దరఖాస్తు చేశారు. ఎటువంటి రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకున్న వారంలోపే మాకు ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది. ఇలాంటి క్యాంపుల వల్ల పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది.

– ఎల్లాల రేణుక, 11వ వార్డు నంద్యాల

### ఉచితంగా ధ్రువ పత్రాలు ఇస్తున్నారు



వారం రోజుల క్రితం మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మా వార్డు కౌన్సిలర్ తమీమ్ మా ఇంటి వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగారు. మాకు అవసరమైన ధ్రువ ప్రతాల గురించి చెప్పడంతో ఉచితంగా అందజేస్తారు వెంటనే దరఖాస్తు చేసుకోమని చెప్పారు. వారే ఉచితంగా ధ్రువ పత్రం అందేలా చేశారు. గతంలో ఇలాంటి పత్రాలు పొందాలంటే మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు పిలిచి మరీ అందిస్తున్నారు. –షేక్ శంషాద్, 11వ వార్డు నంద్యాల

**పశుగ్రాసం సాగుతో లాభాలు**

**చాగలమర్రి:** పాడి రైతులు పశుగ్రాసాన్ని సాగు చేసుకోవడం వల్ల లాభాలున్నాయని ఏడీఏ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 1 నుంచి 16వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన డి.కొత్తపల్లె గ్రామంలో బుధవారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను రూ.115కే అందజేస్తుందని అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విత్తనాలను పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి సాయిబాబా పాల్గొన్నారు.

**వేతనాలు చెల్లించాలి**

**నంద్యాల(న్యూటౌన్):** పదోన్నతులు పొంది నూతనంగా మంజూరైన గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు జూన్ నెల జీతాలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం విద్యాశాఖ ఏడీ అనురాధకు వినతిపత్రం అందజేశారు.

**సద్వినియోగం చేసుకోండి**

**శిరివెళ్ల:** స్థానిక పోస్టాఫీస్‌లోని ఆధార్ కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. సాంకేతిక కారణాలతో ఇటీవల సర్వర్ పని చేయలేదని, ప్రస్తుతం సమస్యను పరిష్కరించామని, ఆధార్ కేంద్రం పునఃప్రారంభమైందని చెప్పారు. ఆధార్‌కు మొబైల్ లింక్, బయో మెట్రిక్ అప్‌డేషన్ తదితర సేవలు చేయించుకోవచ్చని వివరించారు.

**ఈ–కామర్స్ డీల్స్‌పై అప్రమత్తంగా ఉండండి**

**బొమ్మలసత్రం:** ప్రముఖ ఈ–కామర్స్ కంపెనీల సేల్ డే, స్పెషల్ డిస్కౌంట్ పేరుతో ఆఫర్లు ప్రకటించిన రోజుల్లో జాగ్రత్తగా ఉండాలని, నకిలీ సైట్లు, నకిలీ యూఆర్ఎల్‌ల వలలో పడొద్దని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే లింకులపై క్లిక్ చేస్తే విలువైన సమాచారం హ్యాకర్ల చేతికి చిక్కే ప్రమాదముందన్నారు. ఎవరైనా ఈ తరహా మోసాలకు గురై ఉంటే వెంటనే సైబర్ సెల్ ఫిర్యాదు నంబర్ 1930, లేదా నంద్యాల సైబర్ సెంటర్ సెల్ నంబర్ 9154987034 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

**యూసీసీ బిల్లును వ్యతిరేకించాలి**

**నంద్యాల(న్యూటౌన్):** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యూనిఫాం సివిల్ కోడ్ బిల్లును వ్యతిరేకించాలని సీపీఐఎంఎల్ ఆర్ఐ జిల్లా కార్యదర్శి రవిరాజ్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బిల్లు ప్రజా వ్యతిరేకమైనదని, మేధావులు, ప్రజలు, లౌకిక వాదులు, ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కలాంబాషా, శివ, పిచ్చిక లోకేష్ పాల్గొన్నారు.

**పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి**

**రుద్రవరం:** డెంగీ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. డెంగీ మాసోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు**

**రుద్రవరం:** మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ ఏఈ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీరంగాపురం గ్రామంలోని విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ప్రమాదక రంగా ఉన్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఎల్లావత్తు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కే.కొత్తూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో తరచూ అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడేవారు. సమస్యను అక్కడి రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు శ్రీరంగాపురానికి 20, కే.కొత్తూరుకు 40 కొత్త విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించిఆయా గ్రామాలకు తరలించారు.

## ఎస్పీని కలిసిన సీఐలు




ఎస్పీని కలిసిన సీఐ దస్తగిరిబాబు

**బొమ్మలసత్రం:** నంద్యాల పట్టణంలోని తాలుకా, ట్రాఫిక్ పోలీస్టేషన్‌లకు సీఐలుగా భాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇస్మాయిల్, దస్తగిరిబాబు బుధవారం ఎస్పీ కె రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ దస్తగిరిబాబు కొంత కాలంగా నంద్యాల జిల్లా కేంద్రంలోని సెబ్ స్టేషన్‌లో సీఐగా పనిచేశారు. బదిలీల్లో భాగంగా ఆయనను ఉన్నతాధికారులు తాలుకా పోలీస్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే సీఐ ఇస్మాయిల్ పట్టణంలోని కంట్రోల్‌రూమ్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీల్లో భాగంగా ట్రాఫిక్ సీఐగా పంపడంతో విధుల్లో చేరారు.

## మెరుగైన వైద్యం అందించాలి

**నంద్యాలటౌన్:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే వైద్యుల ప్రాథమిక కర్తవ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం నంద్యాల మండలం మిట్నాల, చాపిరేవుల గ్రామాల పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓపీలో ఉన్న రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఓపీ, మందులు రికార్డులను పరిశీలించి రోగుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పరిశీలించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని చెప్పారు. అలాగే అంగన్‌డీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశా, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

**శిరివెళ్ల:** రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బుధవారం గోస్పాడు మండలం యాళ్లూరుకు చెందిన నరసింహుడు, లక్ష్మీదేవి ఆటోలో శిరివెళ్ల నుంచి 520 కేజీలు గల 13 బస్తాల రేషన్ బియ్యంను తరలిస్తుండగా శిరివెళ్ల మెట్ట మధ్య పట్టుకున్నామన్నారు. తరలింపులో రామసుబ్బారెడ్డి పాత్ర ఉందని తమ విచారణలో తేలిందన్నారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

**రుద్రవరం:** ఎ కొండమాయపల్లె గ్రామానికి చెందిన తాయన్న (67) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం గ్రామం నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు అవతలి వైపు దా టే క్రమంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌తో ఢీ కొట్టాడు. దీంతో తాయన్న తీవ్ర గాయాలతో కుప్పకూలాడు.ప్రమాదాన్ని గమనించిన గ్రా మస్తులు చికిత్స కోసం తరలించేందుకు యత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. విషయాన్ని పోలీసులు తెలియజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

## వ్యక్తికి జైలు

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని గిరిన్నాథ్ సెంటర్‌లో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు..గోంట్ల రామగోపాల్ అనే వ్యక్తి గిరిన్నాథ్ సెంటర్‌లో వచ్చిపోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జిజ రెండు రోజులు జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు.

## ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**చాగలమర్రి:** పెద్ద బోధనం గ్రామం వద్ద జాతీయ రహదారిపై నున్న వంతెనపై బుధవారం మోటారు సైకిల్‌ను వెనుకవైపు నుంచి ఏపీ03బిజెడ్5674 నంబరు గల కారు ఢీ కొనడంతో ఆవులపల్లె గ్రామానికి చెందిన రమణయ్య, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వీరిని ప్రమాదానికి కారణమైన కారులోనే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సరికాదు

**నంద్యాల(అర్బన్):** వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే ఉపసంహరించుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఒక పార్టీ అధ్యక్షుడై ఉండి సమాజ సేవకు అంకితమైన వలంటీర్లపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సేవలు ఎనలేనివని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి బాధితులను ఆదుకున్న సంఘటనలు కోకొల్లలన్నారు. ఆ వ్యవస్థతో ప్రభుత్వానికి మంచి పేరు రావడాన్ని చూసి భరించలేకే ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆరోపణలను వెనక్కి తీసుకోకపోతే వలంటీర్లే పవన్‌కు బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

**తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం**



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

**చాగలమర్రి:** పండ్ల తోటల పెంపకానికి రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీతో ప్రోత్సహిస్తోందని ఉపాధి హామీ పథకం ఏపీడీ సాంబశివరావు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ పథకం ద్వారా మండలంలో 300 ఎకరాల్లో ఉద్యానవన పంటలైన మామిడి, టెంకాయ, మునగ, నిమ్మ, చీని, సపోటా తదితర పంటల సాగుకు ముడేళ్ల పాటు వం శాతం రాయితీతో నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. అయితే ఇప్పటి వరకు 200 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఏపీఓ పి. నిర్మల దేవి పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ**

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడమాసం సందర్భంగా బుధవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో అభిషేకం చేసి 108 వెండి పుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సతీమణి స్వర్ణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉప్పు జగన్‌ప్రసాద్ ఆమెకు అమ్మవారి మెమొంటో అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ పాల్గొన్నారు.